క్లుప్తంగా

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

చిట్యాల: మండలంలోని రైతులకు 2024 వానాకాలం పంటల సాగుకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించేందుకు అందుబాటులో ఉన్నాయని చిట్యాల మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాల 30 కేజీల బస్తాకు రూ.2790 ఉండగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.1116లకు, జనుము విత్తనాల 40 కేజీల బస్తాకు రూ.3620 లకుగాను సబ్సిడీపై రూ.1448 లకు అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు పట్టదారు పాసుబుక్, ఆధార్‌కార్డు జీరాక్స్‌లతో చిట్యాలలోని సింగిల్ విండో కార్యాలయం, గ్రామాల్లోని రైతుల వేదికల్లో ఏఈఓలను సంప్రదించాలన్నారు.

24న ఎంపీపీ ఎన్నిక

మర్రిగూడ : ఈ నెల 24న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నూతన ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల ప్రకారం, కలెక్టర్ ఆదేశాల మేరకు మర్రిగూడ మండల నూతన ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నామని, ఈమేరకు ఎంపీటీసీ సభ్యులందరికీ నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు. ఈ ఎన్నికకు ఎంపీటీసీలందరూ హాజరుకావాలని కోరారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీపీగా కట్కూరి వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

కేతేపల్లిలో 1456 మంది పట్టభద్రుల ఓటర్లు

కేతేపల్లి: మండలంలోని 16 గ్రామల పరిధిలో 1456 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నట్లు తహసీల్దారు ఎస్.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో పురుషులు 969, మహిళలు 487 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూతులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 563 నంబరు పోలింగ్ బూత్‌లో 718 ఓటర్లు, 564 నంబరు పోలింగ్ బూత్‌లో 738 ఓట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. బీఎల్‌ఓల ద్వారా ఓటర్లకు పోలింగ్ చిట్టీలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఓటు ఉన్న ప్రతి పట్టభద్రుడు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

జాతర ఆహ్వాన పత్రిక అందజేత

నకిరేకల్ : మండలంలోని నెల్లిబండ గ్రామంలో ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే శ్రీ లింగ మంతుల స్వామి జాతరకు రావాలని కోరూతూ ఆలయ పాలక వర్గం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓఎస్డీలకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ యానాల శేఖర్‌రెడ్డి, యానాల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

24 నుంచి శ్రీ భాగవత సప్తాహం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ): ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు పట్టణంలోని రామగిరి ఇండియన్ గ్యాస్ కార్యాలయం సమీపంలో అక్కినేపల్లి లక్ష్మణరావు శ్రీదేవి నివాసంలో శ్రీ భాగవత సప్తాహం జరగనుంది. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం అర్చకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24వ తేదీన జరిగే ఇరామానుశ నుర్తాదాది పారాయణంకు అష్టాక్షరి సంపత్ కుమార జీయర్‌స్వామి, 26 తేదీన లక్ష మల్లెపు ష్పార్చనకు శ్రీ అహోబిల రామానుజ జీయర్ స్వామి, 29వ తేదీన ధన్వంతరి యాగానికి శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీమాన్ నల్లాని చక్రవర్తుల రామకృష్ణచార్యులు, రామరంగాచార్యులు, అక్కినేపల్లి లక్ష్మణ్‌రావు శ్రీదేవి, సత్యనారాయణ, అరుణ, పద్మావతి, విజయలక్ష్మి, ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మిర్యాలగూడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి మాట్లాడారు. ఈనెల 21న పట్టణంలోని టీఎస్‌ఆర్ గార్డెన్‌లో 2వేల మంది పట్టభద్రులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఈ సమావేశానికి అభ్యర్థి రాకేష్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మోసిన్‌అలీ, జొన్నలగడ్డ రంగారెడ్డి, నారాయణరెడ్డి, బాబయ్య, కరుణాకర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, ఫయాజ్, రవీందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నా చెత్త.. నా బాధ్యత !

- తడి, పొడి చెత్త వేరుగా సేకరణకు మున్సిపాలిటీ నిర్ణయం
- ఇంట్లోనే వేరు చేసేలా ప్రజలకు అవగాహన

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో చెత్త సేకరణ ఇక నుంచి సరికొత్తగా చేయాలని మున్సిపల్ యంత్రాంగం నిర్ణయించింది. నా చెత్త.. నా బాధ్యత, మన ఇంట్లో మన చెత్తను మనమే వేరు చేద్దాం అనే నినాదంతో పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ అధికారులు భావిస్తున్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని మున్సిపల్ సిబ్బంది ఎంత ప్రచారం చేసినా పట్టణ ప్రజలు రెండింటిని కలిపి మున్సిపల్ వాహనాల సిబ్బందికి అందిస్తున్నారు. ఇక నుంచి ఇలా కాకుండా వారంలో ఐదు రోజులు తడి చెత్త, రెండు రోజులు పొడి చెత్త సేకరించాలని ఒక నిర్ణయానికి వచ్చారు.

మహిళా సంఘాల ద్వారా ప్రచారం..

ప్రతి మంగళవారం, శుక్రవారం పొడి చెత్తను మాత్రమే మున్సిపల్ సిబ్బంది తీసుకుపోతారు. మిగతా రోజుల్లో మాత్రం తడి చెత్తను సిబ్బంది సేకరిస్తారు. దీనిని కచ్చితంగా అమలుచేసేందుకు మున్సిపల్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

చెత్త సేకరణలో హానికరమైన వస్తువులు

పట్టణ ప్రజల నుంచి మున్సిపల్ సిబ్బంది సేకరిస్తున్న చెత్తలో హానికరమైన వస్తువులు కూడా వస్తున్నాయి. దీని ద్వారా మున్సిపల్ సిబ్బందికి గాయాలు అయి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బ్లేడ్‌లు, బీరు సీసాల ముక్కలు, మందుల డబ్బాల లాంటి హానికరమైన వస్తువులను ఒకే చెత్తలో వేసి మున్సిపల్ సిబ్బందికి అందిస్తున్నారు. కొన్నిసార్లు బ్లేడ్‌లు, బీరు సీసా ముక్కలు సిబ్బందికి గుచ్చుకొని గాయాలపాలవుతున్నారు. ఇక నుంచి వీటి ద్వారా ప్రమాదం జరుగకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నారు.



మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులతో చర్చించి, స్థానికంగా ఉన్న పొదుపు సంఘాల మహిళలు, ఇతర ప్రచార సాధనాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. దీని ద్వారా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులు తప్పే అవకాశం ఉండడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే తడి చెత్త, పొడి చెత్త వేరు, వేరు రోజుల్లో సేకరించేలా మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. మొదట పది రోజులపాటు దీనిపై విస్తృతంగా ప్రచారం చేసిన తరువాత దీనిని ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. వావ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కలెక్టర్ హరిచందన మొదట నీలగిరి మున్సిపాలిటీలో అమలు చేయాలని నిర్ణయించారు.

వేరుగా ఇస్తేనే చెత్త సేకరణ..

తడి, పొడి చెత్తను ఇంట్లోనే ప్రజలు వేరు చేసుకోవాల్సి ఉంటుంది. తడి చెత్తను రెండు, మూడు రోజులు నిల్వ ఉంచితే దుర్వాసన వచ్చే అవకాశం ఉంటుంది. పొడి చెత్త నాలుగైదు రోజులు ఉన్నా ఎలాంటి దుర్వాసన వచ్చే అవకాశం లేదు. తడి, పొడి, హానికరమైన చెత్తను ఇంట్లోనే ప్రజలు వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలి. రానున్న రోజుల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇస్తేనే మున్సిపల్ సిబ్బంది తీసుకుంటారు. అన్ని రకాల చెత్తను కలిపి ఇస్తే మున్సిపల్ సిబ్బంది తీసుకోరు.



చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం



తడి చెత్త, పొడి చెత్త ఇంట్లోనే వేరు చేసి ఇవ్వాలని ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం. ఆడియో రికార్డ్ చేసి మున్సిపల్ వాహనాలకు బిగిస్తాం. మెప్మా ఆర్పీల ద్వారా కూడా ఇంటింటి ప్రచారం చేయిస్తాం. తడి, పొడి చెత్త వేరు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

తడి చెత్త..

మిగిలిపోయిన శాకాహార, మాంసాహార పదార్థాలు, కాయగూరలు, పండ్లతొక్కలు, వాడిన టీ పొడి, ఎండిపోయిన పూలు, ఆకులు. తదితర సేంద్రియ పదార్థాలు.

పొడి చెత్త..

కాగితాలు, గాజు సీసాలు, కాగితం కప్పులు, రబ్బరు, ప్లాస్టిక్ బ్యాగులు, పాల కవర్లు, ప్యాకింగ్‌కు వాడిన కాగితం, ప్రింటెడ్ పేపర్లు, తిరిగి ఉపయోగించని పలు పదార్థాలు.

హానికరమైన చెత్త

శానిటరీ నాప్కిన్స్, డైపర్లు, బ్యాండేజ్ దూది, తడి టిష్యులు, టాయిలెట్ పేపర్లు, మెడికల్ మందుల బాటిల్స్, టాబ్లెట్స్ కవర్స్, పురుగు మందుల డబ్బాలు, బ్లేడ్స్, గోళ్లు, మొదలైన హానికరమైన పదార్థాలు.

తీరనున్న సిబ్బంది ఇబ్బందులు

- తహసీల్దార్ కార్యాలయంలో అదనపు గదుల నిర్మాణం
- నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి తగిన గదులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ ఇబ్బందులు అతి తొందరలోనే తీరనున్నాయి. 2012లో తహసీల్దార్ కార్యాలయాన్ని కేవలం నాలుగు గదులతో మాత్రమే నిర్మించారు. అందులో ఒకటి తహసీల్దార్‌కు కేటాయించగా మరో గది రికార్డులకు, ఇంకొకటి కంప్యూటర్లకు కేటాయించారు. మిగిలినది ఒకే గది. ఆ గదిలోనే డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఆర్‌ఐలతో పాటు ఇతర సిబ్బంది ఉండేందుకు కేటాయించారు. ఆ గది సిబ్బంది అందరికీ సరిపోకపోవడంతో పక్కనే ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయంలో ఓ గదిని కొంత మంది సిబ్బంది వినియోగిస్తున్నారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. ఈ విషయం తెలిసిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. తాను గెలిచిన 10 రోజుల్లోనే తహసీల్దార్ కార్యాలయంలో అదనపు గదుల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ వేగంగా పనులు చేస్తుండడంతో ఇప్పటికే స్లాబ్ పూర్తయింది. మరో రెండు, మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తయి భవనం అందుబాటులోకి రానుంది.



నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ అదనపు గదులు

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నర్సింహ

మునుగోడు: ప్రతి రైతు తమ వ్యవసాయ భూమిలో భూసార పరీక్షలు చేయించుకొని, ఆ భూమికి అనువైన పంటలు సాగు చేసుకోవాలని ఏఈఓ ఎం.నర్సింహ సూచించారు. శుక్రవారం మండలంలోని పులిపలుపుల గ్రామ రైతు వేదికలో క్లస్టర్ పరిధిలోని రైతులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు వరంగంటి సుధాకర్, మల్లయ్య, దామోదర్, ముత్తయ్య, నర్సింహ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని రాచకొండ గ్రామ మాజీ సర్పంచ్ కడిలబావితండాకు చెందిన పానుగోత్ లోక్యనాయక్(80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. లోక్యనాయక్ మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత పోటీ చేయాలి

చండూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో నిరుద్యోగ యువత పోటీ చేయాలని నేషనల్ ఫోరం ఫర్ పీపుల్స్ ఎంపర్‌మెంట్ అండ్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరగోని కిరణ్ ఫిషర్, జిల్లా కన్వీనర్ రఘుమారెడ్డి శుక్రవారం చండూరులో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలంటే యువత పాత్ర ఎక్కువగా ఉండాలని, సర్పంచ్ ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా పోటీ చేయాలన్నారు.

తెలుగు సాహిత్యంపై అవగాహన



చిన్నారులకు సూచనలిస్తున్న ఏబూషి నర్సింహ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ప్రముఖ సాహితీవేత్త, చిత్రకారుడు ఏబూషి నర్సింహ శుక్రవారం చిన్నారులకు పలు సూచనలు చేశారు. తెలుగు సాహిత్యం గొప్పతనం, భాషా ప్రావీణ్యం వంటి అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. అనంతరం చిత్రాలు గీసే విధానంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నర్సింహను గ్రంథాలయ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్ సత్కరించారు. కార్యక్రమంలో బొడిగె కీర్తి, గరిషే అంజయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు



అంబరిల్లాను తొలగిస్తున్న అధికారులు

నల్లగొండ టూటౌన్: మున్సిపల్ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోకుండా అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. నీలగిరి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో అనుమతి లేకుండా ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన అంబరిల్లాలను శుక్రవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పది అంబరిల్లాలను తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించండి'

నార్కట్‌పల్లి: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అందే బాబయ్య కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మండల వెంకన్న, నరసింహ, శ్రీను, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, మునుకుంట్ల గణేశ్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, మెడబోయిన శ్రీనివాస్, రామలింగం, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటు వేయండి

చండూరు : దశాబ్దాలుగా విద్యా వ్యవస్థకు పట్టిన బూజు వదలాలంటే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేయాలని బీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మాదగోని నాగార్జున కోరారు. బంగారిగడ్డ గ్రామంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేటి విద్యా వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

నర్రా ప్రవీణ్‌రెడ్డికి డాక్టరేట్



ప్రవీణ్‌రెడ్డిని అభినందిస్తున్న కూరెళ్ళ విఠలాచార్య

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత నర్రా ప్రవీణ్‌రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు సాహిత్యం విభాగంలో శుక్రవారం డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రవీణ్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు పర్యవేక్షణలో 'డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి సాహిత్యం-సమగ్ర అధ్యయనం'అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా నర్రా ప్రవీణ్‌రెడ్డిని పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ళ విఠాలాచార్య శుక్రవారం అభినందించి సత్కరించారు. అదేవిధంగా ప్రముఖ కవులు, రచయితలు ఎం.వి.గోనారెడ్డి, వేణు సంకోజు, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ బెల్లి యాదయ్య, డాక్టర్ చింతల రాకేష్ భవాని, ఏబూషి నర్సింహ, పున్న అంజయ్యలు ప్రవీణ్‌రెడ్డిని అభినందించారు.

సీపీఎం కార్యకర్త యోగేందర్ మృతికి సంతాపం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామానికి సీపీఎం కార్యకర్త నల్ల బోతు యోగేందర్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ము ది రెడ్డి సుధాకర్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి మన్నెం భిక్షం, సీతారామ్‌రెడ్డి, లతీఫ్ పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్ : సామాజిక న్యాయ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్‌బీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే సబ్బండ కులాల సమ్మేళనంలో సబ్బండ కులాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకుడు కె.పర్వతాలు పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం ఎజెండాగా జేఏసీ పనిచేస్తుందన్నారు. ఈ సమ్మేళనానికి న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, మేధావులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఎండీ నజీరుద్దిన్, దుడుకు లక్ష్మీనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, వంటిపాక యాదగిరి, మామిడి ప్రమీల, చాంద్‌పాష, వంగూరు సత్యనారాయణయాదవ్, పగిళ్ల కృష్ణ, బొజ్జ దుర్గయ్య, వల్లకీర్తి శ్రీనివాస్, షకీల్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.పర్వతాలు

జోరుగా పత్తి విత్తనాల కొనుగోళ్లు



విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

మునుగోడు: వానాకాలం పంట సీజన్ ప్రారంభం కావడంతోపాటు గురువారం రాత్రి వర్షం కురవడంతో మునుగోడు మండలంలోని రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా రైతులు అధికంగా పత్తిసాగు చేస్తారు. వర్షం కురవడంతో రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి పంట సాగు చేసే రైతులు దుక్కులు దున్నుకోవడంతోపాటు పంట సాగుకు అవసరమైన విత్తనాలను దుకాణల్లో కొనుగోలు చేస్తున్నారు. మరోమారు వర్షం కురిస్తే విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో మండలవ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలు రైతులతో కిక్కిరిసి పోతున్నాయి.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని గిరిజన గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 23న మిర్యాలగూడెం పట్టణం అవంతిపురం గిరిజన గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజనల్ ధృవపత్రాలతో హాజరుకావాలన్నారు. సమాచారం కోసం 8185973016, 9346436829 నంబర్లను సంప్రదించాలన్నారు.

అతిథి గృహాలను పట్టించుకునేవారేరి



నకిరేకల్‌లో శిథిలమైన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్



మునుగోడులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

- నకిరేకల్, మునుగోడు మండల కేంద్రాల్లో శిథిలావస్థలో గెస్ట్‌హౌస్‌లు
- పట్టించుకోని పాలకులు

నకిరేకల్ : నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లో జాతీయ రహదారి పక్కన సువిశాలమైన ప్రదేశంలో నిజాం నవాబులు కాలంలో నిర్మించిన అతిథి గృహం రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది. ఈ అతిథి గృహం శిథిలమైపోవడంతో సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు శాశ్వతంగా మూసివేశారు. ఆవరణ అంతా అపరిశుభ్రంగా మారింది. కొన్నేళ్లుగా ఈ అతిథి గృహం ఆవరణలో మున్సిపాలిటీ పారిశుధ్య వాహనాల పార్కింగ్ కోసం వినియోగించుకుంటున్నారు. మెయిన్ సెంటర్‌లో ఉన్న ఈ ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని పునర్నిర్మిస్తే మెయిన్ సెంటర్‌కు కొత్త కళ వస్తుంది. పాలకులు స్పందించి అతిథిగృహాన్ని పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా అతిథి గృహం

మునుగోడు: నియోజకవర్గ కేంద్రం కావడంతో మునుగోడుకు నిత్యం వివిధ అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తుంటారు. అయితే వారు కాసేపు విశ్రాంతి తీసుకోవడంతోపాటు మధ్యాహ్న సమయంలో భోజనం చేసేందుకు 33 ఏళ్ల క్రితం బస్టాండ్ ఎదురుగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని నిర్మించారు. దానిని 15 ఏళ్లపాటు వినియోగించారు. అనంతరం మరమ్మతులకు నోచుకోవడంతో తొమ్మిదేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్సీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి నిధుల నుంచి మరమ్మతులు చేయించారు. ఆ తరువాత అందులో కొంతభాగం ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయానికి వినియోగించగా మరికొంత భాగం అతిథుల కోసం ఉంచారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని మరోచోటుకు మార్చడంతో దానిని పట్టించుకునేవారు లేకుండా పోయారు. దీంతో ఆ భవనం అంతా వివిధ రకాల వస్తువులతో పెంట కుప్పలా మారింది. ఊడ్చేవారు లేకపోవడంతో ప్రస్తుతం బూత్‌బంగ్లాను తలపిస్తోంది. దీంతో మండల కేంద్రానికి వచ్చిన అతిథులు ఆ భవనాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. సంబంధిత అధి కారులు పట్టించుకుని శిథిలావస్థకు చేరుకుంటున్న భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పండ్లు, ఆకుకూరలతో బీపీ నియంత్రణ

చౌటుప్పల్ : ఉరుకులుపరుగుల జీవనం, మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల రక్తపోటు(బీపీ) పెరిగి ప్రాణాంతకంగా మారుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాపారావు పేర్కొన్నారు. ప్రస్తుతం సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు రక్తపోటు కూడా ప్రధాన కారణమని, పండ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల బీపీని నియంతించవచ్చని తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం చౌటుప్పల్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. అధిక బీపీ కారణంగా గుండె పోటు, పక్షవాతం వచ్చి ప్రపంచంలో ఏటా 16లక్షల మంది చనిపోతున్నారని పేర్కొన్నారు. 2025నాటికి దేశంలో రక్తపోటు బాధితల సంఖ్యను 25శాతానికి తగ్గించాలని డబ్ల్యూహెచ్‌ఓ నిర్ణయించిందన్నారు. అందు కోసం ప్రతి ఒక్కరూ తమ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, బయట లభించే జంక్ ఫుడ్‌వంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, సుమన్ కల్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు శిల్పిని, యశోద, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమన్‌కళ్యాణ్, మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటంరాజు , వైద్య సిబ్బంది మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, నాగేష్, ఇస్తారి, అశోక్, శశికళ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాపారావు

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా


మిర్యాలగూడ : గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని జంకుతండాలో ఆయన తాగునీటి బోరును ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకుగాను అన్ని చర్యలు తీసుకుంటామని అందులో భాగంగానే గ్రామంలో తాగునీటి బోరును ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని కృష్ణా కాలనీలో గల కేవీఆర్ ఐఐటీ అకాడమీలో వివిధ పాఠశాలలకు చెందిన వంది మంది విద్యార్థులకు కేవీఆర్ అకాడమీ కరస్పాండెంట్ కాతోజు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐఐటీ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిట్టిబాబునాయక్, ఇరుగు మధు, జానకిరాంరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

- మృతుడు మునుగోడు వాసి



ఓరుగంటి రాఘవేందర్ (ఫైల్)

ఖిలా వరంగల్: అత్తారింటికి వచ్చిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ నగరంలోని శంభునిపేట విశ్వనాథ కాలనీలో జరిగింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్ల గొండ జిల్లా మునుగోడుకు చెందిన ఓరుగంటి రాఘవేందర్(23)కు ఏడు నెలల క్రితం వరంగల్ నగరంలోని విశ్వనాథ కాలనీకి చెందిన రాజేశ్వరితో వివాహం జరిగింది. ఓటు వేసేందుకు ఈ నెల 13న మునుగోడు నుంచి రాజేశ్వరి పుట్టింటికి వచ్చింది. భార్యను తీసుకెళ్లేందుకు భర్త రాఘవేందర్ గురువారం ఉదయం అత్తారింటికి వచ్చాడు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో గుడిసెకు బిగించిన సీలింగ్ ఫ్యాన్ అతడి చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై కుప్పకులాడు. గమనించిన భార్య, అత్తామామ వెంటనే ఆటోలో అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఓరుగంటి సాయిలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.